క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ సమావేశం

రంగంపేట: మండల పరిధిలోని ఈలకొలను గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నామని మాజీ ఎమ్మెల్యే, అనపర్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యోగా గురువు రాణికి సత్కారం



యోగా గురువు రాణిని సత్కరిస్తున్న మహిళలు

బిక్కవోలు: గురుపౌర్ణమి సందర్భంగా కొమరిపాలెంలో యోగా గురువు కర్రి రాణిని గురువారం ఘనంగా సత్కరించారు. యోగా సాధన చేస్తున్న మహిళలందరూ ఈ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ జీవితం ఎదగడానికి సహాయపడిన గురువులను గౌరవించడం అభినందనీయమన్నారు.

సోమేశ్వరస్వామికి లక్ష పత్రి పూజ

పెదపూడి: గ్రామంలోని ప్రాచీన సోమేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొమ్మానపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు ప్రత్యేక పూజలు చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు జరిగాయి.

బీఎల్ఓలకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణ నాయక్

రాజానగరం: భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్ఓ) గురువారం శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజమహేంద్రవరం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు రోజుల పాటు ఐదు బ్యాచ్‌లలో 250 మంది బీఎల్ఓలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కిన బియ్యంతో అన్నం వండుతారా..



పాఠశాలలో బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ తదితరులు

కోరుకొండ: కోరుకొండ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ముక్కిన, నిల్వ ఉన్న బియ్యంతో అన్నం పెడతారా అని హెచ్ఎంను సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీశారు. గురువారం కోరుకొండలో జరిగిన మెగాపేరెంట్, టీచర్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని పరిసరాలను సర్పంచ్ సరోజ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆమె దృష్టికి వచ్చాయి.

విద్యా పథకాలను వినియోగించుకోవాలి

రంగంపేట: విద్యా పథకాలను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేసారు. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. తహసీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీఓ వి. వీర సాయిబాబు, ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరన్న పాల్గొన్నారు.

పెదపూడి: స్థానిక గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0 నిర్వహించారు. ఉత్తమ విద్యార్థులతో ఉపన్యాసం చేయించారు. ప్రతి విద్యార్థికి మొక్కను అందించి దానిని ఇంటి వద్ద నాటి పరిరక్షించాలని ఉపాధ్యాయులు చెప్పారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన కాకి అపర్ణ (556), మనోహర్(552)కు రూ.5 వేల చొప్పున ఎంఈఓ–1 సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు వల్లూరి మరియమ్మ, సచివాలయం కార్యదర్శి జి.ఉషారాణి, సీహెచ్‌సీడీసీ మాజీ చైర్మన్ ఆరుమిల్లి అమ్మన్న చౌదరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఆరుమిల్లి వాసు పాల్గొన్నారు.

కూటమి కథ.. పేదల వ్యథ

- స్పౌజ్ పింఛన్ల కోసం ఎదురుచూపులు
- మంజూరైనా సొమ్ములు ఇవ్వని వైనం
- నియోజకవర్గంలో 530 మంది నిరీక్షణ



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

బిక్కవోలు: నియోజకవర్గంలోని బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన ఎస్.నాగేశ్వరరావు గత ఏడాది మృతి చెందాడు. ఆయనకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. నాగేశ్వరరావు మరణానంతరం అతడి భార్య పైడమ్మ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఆమెకు స్పౌజ్ పింఛను మంజూరు చేస్తామని, జూన్ 12న ఇస్తామని కూటమి నాయకులు తెలిపారు. అలాగే అదే నెల 12వ తేదీన ఆమెకు పింఛన్ మంజూరైనట్టు సచివాలయం సిబ్బంది సమాచారం కూడా ఇచ్చారు. కానీ నేటి వరకూ ఆమెకు పింఛన్ సొమ్ము అందలేదు. అదేమిటని సచివాలయం ఉద్యోగులను అడిగితే పింఛన్ మంజూరైంది, కానీ డబ్బులు రాలేదని చెప్పారు. ఇది ఒక్క పైడమ్మ సమస్యే కాదు. చాలా మంది ఇదే విధంగా పింఛన్ సొమ్ము కోసం ఎదురు చూస్తున్నారు.

కూటమి గొప్పలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయి రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టింది. ఈ ఏడాది కాలంలో కొత్తగా ఏ ఒక్క వితంతువుకు గానీ, దివ్యాంగునికి గానీ, డప్పు కళాకారుడికి గానీ, కల్లుగీత కార్మికుడికి గానీ, చేనేత కార్మికుడికి గానీ, ట్రాన్స్ జెండర్లకు గానీ పింఛన్ మంజూరు చేసిన దాఖలాలు లేవు. వృద్ధాప్య పింఛన్ తీసుకునే భర్త చనిపోతే, ఆయన భార్యకు ఇచ్చే స్పౌజ్ (భాగస్వామి) పింఛన్లు మాత్రమే మంజూరు చేస్తుంది. వాటినే కొత్తగా మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటోంది. పోనీ అవి అయినా ఇస్తున్నారంటే పింఛన్ మంజూరైంది గానీ డబ్బులు రావడం లేదు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పౌజ్ కోటాలో 530 పింఛన్లు

నియోజకవర్గంలో స్పౌజ్ (భాగస్వామి) కోటా కింద 530 పింఛన్లు మంజూరయ్యాయి. వాటిలో అనపర్తి మండలంలో 123, బిక్కవోలులో 143, పెదపూడిలో 132, రంగంపేటలో 132 ఉన్నాయి. వీరందరికీ జూన్ 12న పింఛన్ సొమ్ము అందజేస్తామని కూటమి ప్రభుత్వం తెలిపింది. కానీ ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.

> **మంజూరయ్యాయి**
>
> 
>
> స్పౌజ్ కోటా కింద పింఛన్లు మంజూరయ్యాయి. వాటికి సంబంధించిన డబ్బులు విడుదలయ్యాయి. అయితే వెల్ఫేర్ అసిస్టెంట్ యాప్‌లో ఎనబుల్ అవ్వలేదు. దీని వల్ల డబ్బులు ఇవ్వలేదు. యాప్‌లో ఎనబుల్ అయిన వెంటనే డబ్బులు అందించడం జరుగుతుంది.
>
> – శ్రీనివాస్, ఎంపీడీవో, బిక్కవోలు



లోకల్వర్టు వద్ద పొక్లెయిన్‌తో ఏర్పాటు చేస్తున్న తూరలు



లోకల్వర్టుపై సిద్ధమైన రహదారి

లోకల్వర్టుపై రాకపోకలకు మార్గం సిద్ధం

సీతానగరం: చీపురుపల్లి - చినకొండేపూడి రోడ్డులోని అప్పన్న చావిడి వద్ద గల లోకల్వర్టుకు తాత్కాలికంగా తూరలు ఏర్పాటు చేశారు. ఈ కల్వర్టుపై నుంచి క్వారీ లారీలు రాకపోకలు సాగించడంతో తూరలు పగిలి, మూసుకుపోయాయి. దీంతో ముంపు నీరు ముందుకు వెళ్లే మార్గం మూసుకుపోయింది. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి గ్రామాలతో పాటు పంట పొలాల నుంచి నీరు తరలివెళ్లే మార్గం ఇదే కావడంతో రైతులు ఆందోళన చెందారు. దీనిపై సాక్షి పత్రికలో వరస కథనాలు వచ్చాయి. వైఎస్సార్ సీపీ ఎంప్లాయాస్, పెన్షనర్ల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు ఆధ్వర్యంలో రైతులతో కలసి ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ కూడా ఫిర్యాదు చేశారు. దీంతో తొమ్మిది సిమెంట్ తూరలు తీసుకువచ్చి, వాటిని మూడు వరసలుగా వేసి, లోకల్వర్టుపై మార్గం ఏర్పాటు చేశారు. దీని వల్ల రాకపోకలకు, ముంపు నీటి ప్రవాహానికి మార్గం ఏర్పడింది. అయితే రోడ్డు మార్గంలో గ్రావెల్ వేయాలని, లేకుంటే వాహనాలు జారి పడే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. చినకొండేపూడి నీటి సంఘం అధ్యక్షుడు కోసే శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ తూరలు ఏర్పాటు చేయడంతో రాబోవు రోజుల్లో ఎటువంటి ముంపు సమస్య ఉండదన్నారు.

సంపద కేంద్రంతో అదనపు ఆదాయం



అచ్యుతాపురత్రయంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

పెదపూడి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంతో అదనపు ఆదాయం సమకూరుతుందని, ఆ కేంద్రాన్ని మరింత వినియోగించుకోవాలని జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు అన్నారు. అచ్యుతాపురత్రయం గ్రామాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా సంపద తయారీ కేంద్రానికి వెళ్లి అక్కడ తడి, పొడి చెత్త ఏ విధంగా వేరుచేస్తున్నారో పరిశీలించారు. వర్మీ కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించారు. గ్రామంలో వనరుల సంరక్షణ, పీ4 మార్గదర్శి, బంగారు కుటుంబం విధానంపై అధికారులతో చర్చించారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి ప్రజలు ఏ విధంగా డస్ట్ బీన్లలో తడి, పొడి చెత్తను భద్ర పరిచి క్లాప్‌మిత్రలకు ఇస్తున్నారో పరిశీలించారు. వెలుగు కార్యాలయం ద్వారా డ్వాక్రా అందజేస్తున్న రుణాలు, పథకాలపై మహిళలను వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తాగునీటి రక్షిత పథకం వద్దకు వెళ్లి క్లోరినేషన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.శ్రీనివాసు, సర్పంచ్ అడబాల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో మైనారిటీలకు ప్రాధాన్యం



శ్రావణ్ కుమార్‌ను సత్కరిస్తున్న మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

రంగంపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేయడగానికి మనం అందరం ఇప్పటి నుంచే కృషి చేయాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోర్త శ్రావణ్ కుమార్ కోరారు. మర్రిపూడి గ్రామంలోని అగాపే చర్చి ఆవరణలో గురువారం జరిగిన మండల పాస్టర్స్ ఫెలోషిప్ సహవాస కూడికకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా రాష్ట్రంలో సుపరిపాలన అందించారన్నారు. పాస్టర్లకు, క్రిస్టియన్ మైనార్టీలకు అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. 2029లో జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ముఖ్యమంత్రిగా, అనపర్తి నియోజకవర్గానికి డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం మన బాధ్యతగా భావించి, ప్రార్థనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్ విమలారెడ్డి రచించిన నీతి సూర్యుని వేకువ చుక్క అనే పుస్తకాన్ని అందరికీ అందజేశారు. అనంతరం శ్రావణ్ కుమార్‌ను మండల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ అడపా విజయ్ కుమార్, మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ అడపా అరుణ్ కుమార్, కార్యదర్శి శ్యాప్ ప్రసాద్, ట్రెజరర్ కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

సీతానగరంలో స్వీట్‌షాపు వ్యవహారంపై ఆరా



స్థానికులతో మాట్లాడుతున్న కరాటే కల్యాణి

సీతానగరం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వెంకటేశ్వర స్వీట్ స్టాల్ నిర్వాహకుడు జి.కనికి రెడ్డి.. శ్రీరామాలయంను పునర్నిర్మాణంలో భాగస్వామి అవుతారని చెప్పారని ఆదిబట్ల కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, యాదవ హక్కు పోరాట సమితి జాతీయ మహిళా అధ్యక్షురాలు, బీజేపీ ధార్మిక సెల్ తెలంగాణ స్టేట్ కన్వీనర్ కరాటే కల్యాణి అన్నారు. సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని రామాలయం, స్వీట్ స్టాల్‌ను కళాపీఠం జిల్లా అధ్యక్షురాలు పోతుల సుబ్బలక్ష్మితో కలసి గురువారం ఆమె సందర్శించారు. రామాలయం మండపం కూల్చి స్వీట్ స్టాల్ పెట్టారని ఫిర్యాదు రావడంతో ఆమె వచ్చారు. ఈ సందర్భంగా రామాలయం నిర్వాహకులను పిలిచి ఆరా తీశారు. రోడ్డు విస్తరణలో పోయే రామాలయం ఎక్కడా కట్టినా కనికిరెడ్డి ఆర్థిక సాయం చేస్తానని చెప్పడంతో తామే ఆ స్వీట్ స్టాల్ పెట్టుకోవడానికి ఒప్పుకున్నామని తెలిపారు. అనంతరం కరాటే కల్యాణి విలేకరులతో మాట్లాడుతూ రామాలయం నిర్వాహకులు అంగీకారంతో స్వీట్‌స్టాల్ పెట్టుకున్నారని, ఆరు నెలల్లో ఆలయం నిర్మించే సమయంలో రాతి విగ్రహాలు ఏర్పాటు చేసి, ఆలయం నిర్మాణం జరపడానికి షాపు యజమాని రెడ్డి ఒప్పుకోవడంతో స్వీట్‌స్టాల్ ఉంచడానికి అంగీకరించామన్నారు.

న్యాయం చేయకపోతే ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా

- ఎమ్మెల్సీ బొమ్ము ఇజ్రాయిల్
- అనపర్తి ఆస్పత్రిలో బాధితురాలికి పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుప్పలపూడికి చెందిన దళిత మహిళ కొమ్ము బుజ్జికి న్యాయం చేయకపోతే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఇంటి ముందు ధర్నాకు దిగుతామని ఎమ్మెల్సీ బొమ్ము ఇజ్రాయిల్ హెచ్చరించారు. ఆయన గురువారం ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తమకు రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకోవడానికి వెళ్లి వస్తున్న కొమ్ము బుజ్జి, ఆమె మరిది వీరబాబులపై సుమారు 15 మంది ఇనుపరాడ్లతో దాడి చేస్తే, బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కేసు నీరుగార్చే విధంగా పోలీసులు వ్యవహరించడం దారుణమని విమర్శించారు. హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులైన నల్లమిల్లి వెంకటరెడ్డి (ఎన్వీ) అతని అనుచరులను అరెస్టు చేయకుండా కేవలం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, మరికొన్ని నామమాత్రపు సెక్షన్లతో సరిపెట్టారన్నారు. ఘటన జరిగి ఆరు రోజులు కావస్తున్నా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బాధితులను పరామర్శించడానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

నిందితులను కాపాడటానికేనా..

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తన అనుచరుడు ఎన్వీని కాపాడడానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కనీసం బాధితురాలిని పరామర్శించలేదన్నారు. నిందితులను దాచిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తప్పనిసరి పరిస్థితుల్లో అదే రోజు సాయంత్రం ఎన్వీని, అనుచరులను పోలీస్ స్టేషన్‌కు పంపించారన్నారు. పనికి రాని సెక్షన్లు వేసి కేసులు నమోదు చేసి బయటకు విడిచి పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి పట్టణ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొండేటి భీమేష్, వైస్ ఎంపీపీ కర్రి దాసు, వల్లభశెట్టి రామ సతీష్, సోషల్ మీడియా వేణురెడ్డి, కానూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలతో ప్రశాంతత

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా గురుపౌర్ణమి



జి.మామిడాడ శివారు పాటిమీద సాయిబాబాను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు



బలభద్రపురంలో మాజీ ఎమ్మెల్యే దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



రాజానగరంలో బాబాను దర్శించుకున్న భక్తులు



బూరుగుపూడిలో బాబా ఆలయ గురువు రామారావును సత్కరిస్తున్న భక్తులు



కోరుకొండలో జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



సీతానగరంలోని శ్రీరామనగరంలో..

పెదపూడి: ఆధ్యాత్మిక భావాలతో ప్రశాంతత చేకూరుతుందని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ శివారు పాటిమీద కొలువైన సాయిబాబాను గురుపౌర్ణమి సందర్భంగా గురువారం మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. వారి వెంట ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, కర్రి ఆదిరెడ్డి, మేడపాటి ఫణికుమార్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, కర్రి నాగిరెడ్డి, కర్రి చంద్రారెడ్డి ఉన్నారు.

- జి.మామిడాడలోని బోడావారి వీధిలో గల అభయ గణపతి ఆలయంలో కొలువైన సాయిబాబాకు అర్చకుడు ఇంద్రగంటి మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపూడి, పెద్దాడ, కాండ్రేగుల, కరకుదురు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి.

ఆంధ్రా షిర్డీ సాయిబాబా మందిరంలో..

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయిబాబా మందిరానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. బాబాకు పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం, బంగారు కిరీటాన్ని అలంకరించారు. అనంతరం సుమారు 35 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, కేపీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపరెడ్డి బాబాను దర్శించుకున్నారు. సీఐ సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు సబ్బెళ్ళ పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పందలపాకలోని బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం చేశారు. అనంతరం సబ్బెళ్ల సత్తిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. బిక్కవోలు, తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు, ఊలపల్లి గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రాజానగరంలో..

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజామునే బాబా మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వినాయకులు, దత్తాత్రేయుడు, సరస్వతి మాత విగ్రహాలకు కూడా అభిషేకాలు, అర్చనలు చేశారు. సరస్వతి మాతను వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. సాయి భక్త మండలి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి, లోకకల్యాణార్థం 11 గురువారాలు నిర్వహించే గురు చరిత్ర పారాయణ యజ్ఞం కూడా గురువారం ప్రారంభించారు.

గురువుకు సత్కారం

కోరుకొండ: బూరుగుపూడి బాబా ఆలయంలో గురువు మామిడిపల్లి రామారావును ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కంటే నాగేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కోరుకొండ కానుగవీధి, పెంట్రోలుబంకు, బూరుగుపూడి ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మధురపూడిలోని సుందరస్వామీజీ ఆశ్రమంలో గురుపూజోత్సవం జరిపారు.

- కోరుకొండ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న బాబాను వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి దర్శించుకున్నారు. ఆమె మాట్లాడుతూ గురువును పూజించిన ప్రతి వ్యక్తి శక్తిగా మారిన సందర్భాలను వివరించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు బాబాను దర్శించుకున్నారు. వాకచర్ల సురేష్ గుప్తా దంపతుల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తాడి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో జక్కంపూడి విజయలక్ష్మి, ఆలయ గురువు అప్పారావును ఘనంగా సత్కరించారు.

సీతానగరం మండలంలో..


సీతానగరం: మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాపాక పంచాయతీ పరిధి శ్రీరామనగరంలోని సాయిబాబా ఆలయంలో వడ్లమూరి రామరాజు దంపతులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చినకొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్‌లోని సాయిబాబా వసతి మందిరంలో పూజలు జరిగాయి.

అనపర్తి: మండల కేంద్రమైన అనపర్తిలోని ఔదంబర క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. మల్లిడి సత్యనారాయణరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పాత ఊరులోని బాలరాజేశ్వరీ పీఠంలో అర్చకుడు రెడ్డి సురేష్ శర్మ ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు జరిగాయి. పాతఊరు శివాలయం, శేషగిరి రావుపేట, ఐఎల్‌టీడీ, పాలమూరులోని బాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

గురువులను గౌరవించాలి

సీతానగరం: తల్లిదండ్రులు, గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. ఆ కళాశాలలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

శాకంబరిగా రాజరాజేశ్వరి



బిక్కవోలు: పందలపాక గ్రామంలోని వినాయక నగర్ కొలువైన రాజరాజేశ్వరీ అమ్మవారు గురువారం శాకంబరిగా దర్శనమిచ్చారు. పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు.

చేప రైతుల దినోత్సవం

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేప రైతుల దినోత్సవం నిర్వహించారు. దీనికి హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన, అనుభవజ్ఞులైన చేప రైతుల నుంచి నేర్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు ప్రాయోగిక విద్యా పద్ధతులను అనుసరించి నైపుణ్యం పొందాలన్నారు. భారత ఆహార భద్రతను బలోపేతం చేయడంలో, చేపల ఆధారిత ప్రోటీన్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో, గ్రామీణ ఉపాధిని పెంపొందించడంలో చేప రైతుల పాత్ర ఎనలేనిదన్నారు.

500 మందికి వైద్య సేవలు

సీతానగరం: కాటవరంలోని దహించు అగ్ని మినిస్ట్రీస్‌లో గురువారం నిర్వహించిన శిబిరంలో 500 మందికి వైద్యసేవలు అందించారు. రెవరెండ్ డాక్టర్ థామస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. షీబా థామస్, క్యాథరిన్ జాయిస్, కరిష్మా ప్రైస్ పాల్గొన్నారు